క్లుప్తంగా

మరోసారి గోదావరికి పగ్గాలు



సంగారెడ్డి ఎడ్యుకేషన్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా మరోసారి గోదావరి నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది బీజేపీ అధ్యక్షురాలిగా నియామకమైన అనంతరం జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారు. మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మునిపల్లి(అందోల్): చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల నాయకులు రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రామసేన పేరుతో వచ్చి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, నర్సింలు, గోవింద్ పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ

నారాయణఖేడ్: లయన్స్ క్లబ్ సహకారంతో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సొంతఖర్చులతో కళ్లద్దాలు తయారు చేయించారు. వాటిని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా కన్వీనర్ నరేందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

పేనుబంకను నివారించాలి

ఏడీఏ నూతన్‌కుమార్



జొన్న పంటను పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): జొన్నసాగులో పేనుబంక నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కృష్ణాపూర్‌లో జొన్న, వరి సాగు పనులు పరిశీలించారు. పంట సాగు కోసం కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని అవగాహన కల్పించారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓలు కృష్ణవేణి, సంతోష పాల్గొన్నారు.

షాపుల తొలగింపు



కాల్వను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బస్టాండ్ ఎదుట మురికి కాల్వలపై ఉన్న షాపులను మున్సిపల్ అధికారులు తొలగించారు. బస్టాండ్ ముందు నుంచి పెద్ద కాలువ వెళ్తుంది. కొందరు మురికి కాల్వ స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మురికి నీరు ముందుకు వెళ్లకుండా జామ్ అవుతుంది. ఆర్టీసీ, మున్సిపల్, పోలీసులు కలిసి గురువారం బస్టాండ్ ముందున్న షాపులను తొలగించి కాల్వను శుభ్రం చేసే పనులు ప్రారంభించారు.

డీడీఎస్ కార్యాలయం ముట్టడి



ధర్నాలో మాట్లాడుతున్న డైరెక్టర్

జహీరాబాద్: గతంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీలో డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి ఇచ్చే విషయంలో నిర్వాహకులు తాత్సారం చేస్తున్నారని గురువారం మహిళలు కార్యాలయం ధర్నా నిర్వహించారు. మండలంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ముట్టడించారు. 2000లో సంస్థలో డబ్బులు డిపాజిట్ చేశామని, డిపాజిట్ చేసిన డబ్బు విలువ ప్రస్తుతం రూ.3 కోట్లకు మించి ఉంటుందన్నారు. 1,500 మంది మహిళలకు సంబంధించి బకాయి పడిన మొత్తం డబ్బును వడ్డీతో సహా రూ.8కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో సంస్థలో మహిళలు పని చేసిన మాట వాస్తమే అని, మానుకున్న వాళ్లు సంఘం నడిపించుకో మంటే వారు జమ చేసిన డబ్బులు వాపస్ ఇవ్వడానికి సంస్థ సిద్ధంగా ఉందని డీడీఎస్ కో-డైరెక్టర్ రుక్మిణీరావు తెలిపారు.

మహిళా సంఘాలకు ప్రోత్సాహం

- ఇటుకల తయారీ పనుల అప్పగింత
- జిల్లా వ్యాప్తంగా 118 మంది ఎన్నిక

సంగారెడ్డి టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు ప్రగతి వైపు బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తుంది. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఇందులో భాగంగానే వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను తయారు చేయడానికి మహిళా సంఘాల సభ్యులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ నిర్మాణ సంస్థ బృందం ప్రత్యేకంగా ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 18,465 మహిళా సంఘాలు ఉండగా 1,91,596 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఇటుకల తయారు చేయడానికి ఆసక్తి ఉన్న, అనుభవం ఉన్న వాళ్లను 118 మందిని గుర్తించారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు.

ఉపాధితో పాటు ఆదాయం

ఇటుకల తయారీకి మహిళా సంఘాల సభ్యులను నియమించడంతో వారికి ఉపాధితో పాటు ఆదాయం లభిస్తుంది. తక్కువ వడ్డీకి రుణాలను అందించి వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. మహిళల సంఘాల సభ్యులకు పని కల్పించి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం మార్గదర్శకాలు చేపట్టింది.



స్వయం సహాయక మహిళా సంఘం సభ్యుల సమావేశం

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రోత్సహిస్తాం. ఆరు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సభ్యులకు రుణాలను అందజేసి వాటిని తయారు చేసి అమ్మేలా శిక్షణ కల్పిస్తాం. ఉపాధితో పాటు మంచి ఆదాయం లభించనుంది.
>
> – అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జంగారెడ్డి

అంగన్‌వాడీ భవనం మార్పు

సాక్షి ఎఫెక్ట్..

ఝరాసంగం(జహీరాబాద్): శిథిలావస్థలో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్‌ను సురక్షిత భవనానికి మార్చారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 భవనం గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతోంది. గురువారం సాక్షిలో ప్రచురితమైన ‘శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం’ కథనానికి అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని ఇతర భవనంలోకి మార్చారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీఓ, సీడీపీఓ అంజమ్మ శిథిల భవనాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలోనే మరో భవనాన్ని పరిశీలించి సెంటర్‌ను అక్కడికి మార్చారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



భవనాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓ, తదితరులు

పోటీ పరీక్షలపై అవగాహన



బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర విభాగంలో విద్యార్థులకు పోటీపరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేఎల్ విశ్వవిద్యాలయ గ్లోబల్ బిజినెస్ స్కూల్ అధ్యాపకుడు శరత్ సింహ మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన కలిగినప్పుడే విజయాన్ని సాధిస్తారని అన్నారు. ప్రధానంగా జామ్, ఐఐటీ, ఇతర ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేటప్పుడు ఆయా పరీక్షలకు సంబంధించి పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. పరీక్షలు ఏ విధంగా ఆ పరీక్షలను రాయాలో, ఎటువంటి పుస్తకాలు చదవాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం గణిత శాస్త్ర విభాగానికి సంబంధించి నాల్గొవ సెమిస్టర్లు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ సునీల్, ప్రవీణ్, గణిత శాస్త్ర విభాగాధిపతి సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయకపోతే రాజీనామా చేయండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అభివృద్ధిని విస్మరించారని వారు రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డి-నాందేడ్ 161 నేషనల్ హైవేపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్హేర్-మాసాన్‌పల్లి, పోమ్యానాయక్ తండా-రాపర్తి రోడ్డు నిర్మాణం కోసం తన హయాంలో నిధులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ రాంసింగ్, మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భూపాల్‌రెడ్డి, నాయకులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న ఎంపీడీఓ



సదాశివపేట రూరల్: మాట్లాడుతున్న లక్ష్మి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, మండల నోడల్ అధికారి సుధాకర్, ఎంపీఓ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

సంగారెడ్డి టౌన్ : ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని డీపీఓ సాయిబాబా అన్నారు. గురువారం పోతిరెడ్డిపల్లిలోని రైతు వేదికలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని.. నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో మండల అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓలే కీలకం

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓలు కీలకమని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొసీడింగ్ అధికారులకు గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ యాదగిరి మాట్లాడుతూ.. మొత్తం 249 మంది పీఓలు హాజరు కావాల్సి ఉండగా, 215 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వీరికి మాస్టర్ ట్రైనర్లు అమరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, అల్లం రెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, ప్రొసీడింగ్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీల నాయకులతో సమావేశం

రాయికోడ్(అందోల్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎంపీడీఓ ఎంఎం షరీఫ్ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వివరాలను ఎంపీడీఓ వారికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ సర్పంచ్ కేథరినాథ్ పాటిల్, సీపీఎం మండల నాయకులు దశరథ్, ఎంపీఓ అంజలిదేవి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం..బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి రూ.2 వేలు, మరో ఆరుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కోవెలెంట్ లేబొలేటరీ పరిశ్రమకు నోటీసు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోని కోవెలెంట్ లేబొలేటరీ పరిశ్రమకు నోటీసు జారీ చేసినట్లు ఎంపీఓ యూసుఫ్ గురువారం తెలిపారు. పరిశ్రమ విస్తరణలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశ్రమ యాజమాన్యానికి గ్రామ కార్యదర్శి ద్వారా నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. నిర్మాణాలకు అనుమతులు ఉంటే వీలైనంత త్వరగా గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేయాలని నోటీసులో పేర్కొన్నట్లు స్పష్టం చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

జహీరాబాద్ టౌన్: గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు బీదర్ నుంచి హైదరాబాద్ వైపు మోటారు బైక్‌పై వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం సీఐ శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణ సమీపంలోని అల్లాన రోడ్డు వద్ద కాపుకాచి వారిని పట్టుకున్నారు. వారిని సోదా చేయగా వారి వద్ద 530 గ్రాములు ఎండి గంజాయి లభ్యమయింది. మొబైల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు టీకాలు

పుల్‌కల్(అందోల్): మండలంలోని అమీన్‌పూర్ తండాలో గురువారం పశువులకు ఎదటీకాలు వేశారు. ప్రభుత్వం వేసే ఎదటీకాల వల్ల మేలుజాతి లేగ దూడలు పుడతాయని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శివకుమార్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, మాణిక్యం, రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం

బీజేపీ నాయకురాలు శిల్పారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నేరుగా ఓటర్లను కలసి తమ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనను గెలిపిస్తే నిరుద్యోగుల అండగా ఉంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రాంబాబు గౌడ్, నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజు, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, అనిల్, ప్రసన్నలక్ష్మి , జగన్మోహన్ పాల్గొన్నారు.



విద్యుత్‌నగర్‌లో పర్యటిస్తున్న శిల్పారెడ్డి

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఫజియుల్లా

ఆర్‌డీ స్పెషల్ కమిషనర్ ఫజియుల్లా

కంది(సంగారెడ్డి): నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఆర్‌డీ స్పెషల్ కమిషనర్ ఫజియుల్లా సూచించారు. మండలంలోని కాశీపూర్,కలివేముల,చేర్యాల్, కలివేముల గ్రామాల్లో గురువారం ఆయన నర్సరీలను పరిశీలించారు. ఫజియుల్లా మాట్లాడుతూ...వర్షాకాలంలో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామానికి 6 వేల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతోపాటు పండ్ల మొక్కలను కూడా పెంచాలన్నారు. మొక్కల మధ్య పెరిగే గడ్డి,పిచ్చిమొక్కలను ఎప్పటి కప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ యం.నరసింహారావు, అదనపు డీఆర్డీవో బాల్‌రాజ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీవో గురుపాదం పాల్గొన్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలని ధర్నా

సీఐటీయూ నాయకుడు ప్రవీణ్‌కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అంకేనపల్లి ఎంఆర్‌ఎఫ్ ప్లాంట్‌లో నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 350 మంది కార్మికులను పర్మినెంట్ చేయకుండా యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుంటుందని ఆరోపించారు. యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలను ఆపాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

డంపింగ్ యార్డు వద్దే వద్దు..

సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య



డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసన

జిన్నారం (పటాన్‌చెరు): డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాలపై జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయికి ఎందుకు రావడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య ప్రశ్నించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు వద్దని 13 గ్రామాల ప్రజలు చేస్తున్న పోరాటం కనపడటం లేదా అని విమర్శించారు. గురువారం గుమ్మడిదల, నల్లవల్లి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితిల్లో కూడా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని అన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు తక్షణమే ఎత్తివేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు డంపింగ్ యార్డుకు అనుకూలంగా రిపోర్టు ఇస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఫారెస్ట్ చట్టాన్ని తుంగలో తొక్కిన డీఎఫ్‌ఓపై కేసు నమోదు చేయాలన్నారు. ఈ శాఖలకు సంబంధించిన అధికారులు ఇప్పటివరకు ఏ ఒక్క గ్రామాన్ని కూడా సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని పంట పొలాలు భూగర్భ జలాలు, చెరువులు, తాగునీరు సర్వం కాలుష్యం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పోరాటాలు కనిపించడం లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, హుస్సేన్, రవి, నరసింహ గౌడ్, నర్సాపూర్ ఏరియా కార్యదర్శి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

కల్హేర్(నారాయణఖేడ్): ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవావాన్ని నిర్వహించారు. కలెక్టర్‌గా నందిని, డీఈఓగా నాందేవ్, ఎంఈఓగా శిరీష్, హెచ్ఎంగా మల్లేశం, పలువురు విద్యార్థులు టీచర్లుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇన్‌చార్జి హెచ్ఎం శైలజకులకర్ణి అభినందించారు.

మునిపల్లిలో.. మండలంలోని కంకోల్ ఉర్దూ మీడియం పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజహర్, రాములు, రఫత్, జమీలా, ఫిరోజ్ పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

◆ హోర్డింగ్ కూల్చివేత



రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను గురువారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. అనుమతి లేని హోర్డింగ్‌లపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది.

◆ ఖాళీ దుకాణాలకు టెండర్లు

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపో పరిధిలోని ఖేడ్, పెద్ద శంకరంపేట, కంగ్టి బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాల ఏర్పాటుకు మ్యానువల్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఎం మల్లేశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 వరకు ఖేడ్ డీఎం కార్యాలయంలో టెండర్ల ఫారాలు అందుబాటులో ఉంటాయన్నారు. టెండర్ ఫారాలను పూరించి .. 19న సంగారెడ్డిలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్సులో ఉ.10:30 గంటల నుంచి మ.2 గంటల వరకు వేయాలన్నారు.

◆ మాతాశిశు ఆరోగ్య కేంద్రం పరిశీలన



జహీరాబాద్ టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వెనుకాల రూ. 7.50 కోట్లతో మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర దృష్టికి తీసుకెళ్లి 50 పడకల సిజేరియన్ పోస్ట్‌సర్జికల్ వార్డు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, కిరణ్మాయి ఉన్నారు.

◆ అధికారం లేదన్న బెంగతోనే ధర్నాలు

నారాయణఖేడ్: పదేళ్ల అధికారంలో ఉండి రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకుండా అధికారంలో కోల్పోగానే ప్రజలను మభ్యపెట్టేందుకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలంటూ రోడ్డెక్కుతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గురువారం బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సంగన్న, తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేయించారన్నారు. తొమ్మిదేళ్ల పాటు భూపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి రోడ్ల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అన్ని గ్రామాలు, తండాలకు రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు.

◆ పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశం

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశంను నియమిస్తూ జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు రావడంతో ఇటీవల వెంకటేశంను తొలగించారు. వైస్‌చైర్మన్ సంగారెడ్డిను చైర్మన్‌గా నియమించిన విషయం విధితమే. దీంతో వెంకటేశం కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు తిరిగి వెంకటేశంను చైర్మన్‌గా నియమించారు.

◆ హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే

జహీరాబాద్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు హరీశ్‌రావును ఎమ్మెల్యే మాణిక్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఇబ్బందుల గురించి హరీశ్‌రావుతో ప్రస్తావించినట్లు సమాచారం. కార్యకర్తలకు సంబంధించి ఏవైనా సమస్యలున్నా పరిష్కరిస్తామని హరీశ్ రావు చెప్పినట్లు తెలిసింది.

◆ ఘనంగా సరోజినినాయుడు జయంతి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజిని నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.